క్లుప్తంగా

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు ప్రతిపాదన



పాణ్యంలో శిథిలావస్థకు చేరిన ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో నూతన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ వెంకటేశ్వర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉన్నతాదికారుల సూచనల మేరకు రూ. 3కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ పూర్తి శిథిలావస్థకు చేరడంతో అదే ప్రాంతంలో నూతన భవనం నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆర్‌అండ్‌బీ స్థలానికి సంబంధించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే అధిక వేతనం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ మధుబాబు

కర్నూలు(రూరల్): నిర్దేశిత కొలతల ప్రకారం ఉపాధిహామీ కూలీలు పనులు చేస్తే అధిక వేతనం పొందవచ్చునని ఏపీఓ మధుబాబు సూచించారు. ఉల్చాలలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీల హాజరు, మస్టర్లను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనిచేస్తే రోజువారి వేతనం రూ.300 వరకు వస్తుందన్నారు. ఎండల తీవ్రత కారణంగా కూలీలంతా ఉదయన్నే పనులకు వెళ్లి మధ్యాహ్నం 12 గంటల్లోగా ఇంటికి చేరుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల నుంచి పాణ్యంకు వస్తున్న టిప్పర్ డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ రంగస్వామికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారించి ఢీకొన్న వాహనాలను తొలగించారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయండి



లబ్ధిదారునితో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ వెంకటదాస్

ఓర్వకల్లు: గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వెంకటదాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటదాస్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం మంజూరైన ఇళ్లకు రూ.1.80 లక్షలతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున అదనంగా చెల్లిస్తుందన్నారు. మండలంలో 180 గృహాలు వివిధ దశలలో నిలిచిపోయినట్లు గుర్తించామన్నారు. అనంతరం స్థానిక జగనన్న కాలనీ, మీదివేములలో వున్న జగనన్న కాలనీలను ఆయన సందర్శించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ రామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినోద్‌కుమార్‌రెడ్డి వున్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను అందిస్తున్న రచయిత భాగ్యమ్మ

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థకు పలువురు దాతలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను వితరణ చేశారు. యూఎస్‌ఏకు చెందిన ఎ.అఖిత, ఎ.అస్వర్, రచయిత జి.భాగ్యమ్మ శుక్రవారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌కు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. దాతలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి పునశ్చరణ తరగతులను సందర్శించి రూ.6 వేలు విలువ చేసే విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు చెప్పారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీపీ పెరిగిపోతోంది

- పెరుగుతున్న రక్తపోటు బాధితులు
- అధిక ఆహార సేవనం, అధిక బరువు, మానసిక ఒత్తిళ్లే కారణం
- నేడు అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం



కర్నూలు(హాస్పిటల్): కోపంగా మాట్లాడే వారిని చూస్తే బీపీ పెరిగిపోయిందని అంటుంటారు. కోపంగా మాట్లాడటమే కాదు.. ఖాళీగా కూర్చున్నా బీపీ అధికమవుతుంది. మారిన ఆహార సేవనం, జీవనశైలి,వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిళ్ల వెరసి సమాజంలో బీపీ రోగుల సంఖ్యను పెంచేస్తున్నాయి. ఒకప్పుడు వందలోఒకరో, ఇద్దరిలో బీపీ ఉండేది. ఇప్పుడు ప్రతి పది మందిలో ముగ్గురు, నలుగురులో రక్తపోటు కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 17న అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ప్రస్తుతం 35 పాత, 12 కొత్త ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇవి గాక ఐదు సీహెచ్‌సీలు, ఆదోని, ఎమ్మిగనూరులో ఏరియా ఆసుపత్రులు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, 400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఆశాలు, ఏఎన్ఎంలు కలిసి కొంత కాలంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) సర్వే చేస్తున్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం, పట్టణ ప్రాంతాల్లో 30 శాతం మందికి రక్తపోటు (బీపీ) ఉన్నట్లు వెల్లడవుతోంది. ఒకప్పుడు పట్టణాల్లో మాత్రమే కనిపించే బీపీ జబ్బులు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెరుగుతుండటం గమనార్హం. శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిళ్లు పెరగడం, ఆహారపు అలవాట్ల కారణంగా ధమనుల్లో రక్తపోటు అధికమవుతోంది.

అధిక రక్తపోటు అంటే...

ధమనుల గోడలపై రక్తప్రసరణ సాధారణంగా ఉండాల్సిన దానికంటే ఎక్కువగా ఉండే పరిస్థితిని రక్తపోటు (హైపర్‌టెన్షన్) అంటారు. 19 నుంచి 65 ఏళ్ల వారిలో గుండె సాధారణ స్థితిలో బ్లడ్‌ప్రెషర్(బీపీ) 130/80గా చెబుతారు. హైబీపీని ఒకేసారి కొలిచి నిర్ధారణకు రాకూడదు. కనీసం మూడు సార్లు చెక్ చేయించుకోవాలి. మొదటిసారి వచ్చిన రీడింగ్‌ను వదిలి రెండు, మూడోసారి చెక్ చేసిన రీడింగ్‌లో సగటును తీసుకుని నిర్ధారించుకోవాలి. బీపీ 130/80 కంటే ఎక్కువగా ఉంటే దానిని హై బీపీగా భావిస్తారు. ఈ సంఖ్య మరింత పెరిగితే అది గుండె, మెదడు, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కొందరిలో గుండెపోటు, ఇంకొందరిలో మెదడులో రక్తనాళాలు దెబ్బతినడం, చిట్లడం జరిగి స్ట్రోక్‌తో పక్షవాతానికి గురవుతారు.

హై బీపీ లక్షణాలు

తీవ్రమైన తలనొప్పి, మెడ నరాలు లాగేసినట్లు ఉండటం, ఆకస్మికంగా తూలిపోవడం, ఒళ్లంతా చెమటలు పట్టడం, మూత్రం తక్కువగా రావడం, కాళ్ల తిమ్మిర్లు, మూర్ఛపోవడం, శరీరంలో స్పందన లేకపోవడం వంటివి అధిక రక్తపోటు లక్షణాలు.

ఇలా నియంత్రించాలి

- రోజూ 30 నిమిషాల పాటు వాకింగ్ (నడక) చేస్తే రక్తపోటును 5 నుంచి 8 పాయింట్ల వరకు తగ్గించుకోవచ్చు.
- వీటితో పాటు జాగింగ్, సైక్లింగ్, డ్యాన్స్ కూడా రక్తపోటును తగ్గిస్తాయి.
- యోగా, ప్రాణాయామాలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి
- ఆహారంలో ఉప్పును తగ్గించుకోవాలి. ధూమ, మద్యపానాలు మానేయాలి
- మితాహారం తీసుకోవడం, బరువు తగ్గడం వంటివి.

గుండెపోటుకు కారణం హై బీపీనే !



గుండెపోటుకు ప్రధాన కారణం హై బీపీనే. చాలా మందిలో వారికి హైబీపీ ఉన్నట్లు తెలీదు. ఎప్పుడైనా పరీక్ష చేయించుకున్నప్పుడు మాత్రమే బయటపడుతుంది. జిల్లాలో ప్రతి ముగ్గురిలో ఒకరు హై బీపీతో బాధపడుతున్నారు. ఇటీవల పిల్లల్లో కూడా హై బీపీ కనిపిస్తోంది. ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్చుకుని, వ్యాయామం చేస్తే హైబీపీ తగ్గిపోతుంది. అయినా తగ్గకపోతే మందులు వాడాలి. – డాక్టర్ ఎ.వసంతకుమార్, కార్డియాలజిస్టు, కర్నూలు

అధిక రక్తపోటుతో కిడ్నీలకు చేటు



చాలా మంది రక్తపోటును నిర్లక్ష్యం చేస్తారు. ఏదైనా సమస్య వచ్చేంత వరకు దాని గురించి పట్టించుకోరు. హై బీపీతో ముఖ్యంగా కిడ్నీలకు ఇబ్బంది వస్తుంది. 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సులో హై బీపీ వచ్చిందంటే అప్రమత్తంగా ఉండాలి. కిడ్నీ దెబ్బతినడం వల్లే ఆ వయస్సులో హై బీపీ వస్తుంది. ఇలాంటి వారికి మూత్రంలో ప్రొటీన్‌తో పాటు ఆర్‌బీసీ, రక్తకణాలు పోతుంటాయి. హై బీపీని అదుపులో ఉంచుకునేందుకు వైద్యులు సూచించిన మందులు వాడుతూ ఉండాలి.
– డాక్టర్ సిద్ధార్థ హెరూర్, నెఫ్రాలజిస్టు, కర్నూలు

కర్నూలులో ట్రాఫిక్ మళ్లింపు

కర్నూలు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కర్నూలుకు వస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు, నందికొట్కూరు నుంచి వచ్చే వాహనాలు గార్గేయపురం ఎన్‌హెచ్ 350సీ మీదుగా సఫా కాలేజీ, రింగ్ రోడ్డు, గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి. అలాగే నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి బళ్లారి చౌరస్తా, గుత్తి పెట్రోల్ బంకు, రింగ్ రోడ్డు, సఫా కాలేజీ మీదుగా ఎన్‌హెచ్ - 40, ఎన్‌హెచ్ - 350సీ హైవేల మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. డోన్, అనంతపురం వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలి. ట్రాఫిక్ మళ్లింపును దృష్టిలో ఉంచుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

శతాబ్ది గాయకుడు ఘంటసాల

కర్నూలు కల్చరల్: ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన విశ్రాంత ఎండీఓ చల్లా సుబ్బారాయుడు సంకలనం చేసిన 'శతాబ్ది గాయకుడు ఘంటసాల' పుస్తకాన్ని ఆయన శుక్రవారం గిప్సన్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి బహుకరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. ఘంటసాల పాడిన సుమారు మూడు వేల పాటలను రచయిత సంకలనం చేయడం అభినందనీయమన్నారు. ఆ పాటల రచయిత, చిత్రం, నిర్మాత, సంగీత దర్శకులు, పాడినవారి వివరాలను పుస్తకంలో పొందుపరచడం ప్రశంసనీయమన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



దీక్షలో కూర్చున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని గూడూరు నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ కార్మికులు అరవింద్, మధు హెచ్చరించారు. సమస్యల పరిష్కారంలో భాగంగా రాష్ట్రకమిటీ పిలుపు మేరకు గూడూరులో నగర పంచాయతీ కార్మికులు శుక్రవారం నుంచి విధులను బహిష్కరించి సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా అరవింద్, మధు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో, చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా జీతాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతి కార్మికుడికి టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా నెలకు రూ.29,200 నుంచి రూ.24,400ల వరకు జీతాలు ఇవ్వడంతో పాటు, 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంటు చేయాలన్నారు. దీక్షలో నగర పంచాయతీ కార్మికులు దూకేశ్వరరావు, షబ్బీర్, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, అల్లి బాషా, హరి, పఠాన్, రజాక్, అంజి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు గౌరవ వేతనం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిప్పన్న

ఓర్వకల్లు: ఎంపీటీసీ సభ్యులకు నిలిచిపోయిన గౌరవ వేతనాలను తక్షణమే చెల్లించాలని ఎంపీపీ తిప్పన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తిప్పన్న మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో పాటు, ఎంపీటీసీ సభ్యులు కూడా కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అయితే సర్పంచులకు పంచాయతీ నిధుల్లో గౌరవ వేతనం చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీలకు మాత్రం 16 నెలలకు సంబంధించిన గౌరవ వేతనాలు చెల్లించడంలేదన్నారు. ఎంపీటీసీలపై ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని ఎంపీటీసీ సభ్యుడు పద్మనాభరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్‌లో వున్న గౌరవ వేతనాలను తక్షణమే చెల్లించాలని వారు కోరారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సోమశేఖర్‌రెడ్డి, శకుంతలమ్మ, లక్ష్మీదేవి, ఫాతిమాబీ, నాగిరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కల్లూరులో ప్రతిజ్ఞ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కోడుమూరు రూరల్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌శేఖర్ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కోడుమూరులో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా మారిన డెంగీ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగివుండాలన్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, ఛాతి, అవయవాలపై దద్దుర్లు, వాంతుల వంటి లక్షణాలుంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి తగిన చికిత్స పొందాలన్నారు. ఈఓ అజయ్‌భాస్కర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు దోమలనివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, శానిటర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప,వైద్య సిబ్బంది కమాల్‌సా హెబ్, ఉమాభాయి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరులో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షఫీయాబేగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, హెల్త్ ఎడ్యుకేటర్ క్రిష్టారెడ్డి, సీహెచ్‌ఓ వసంతకుమారి, ఎంపీహెచ్‌ఎస్‌లు రాఘవయ్య, ధరణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయండి

పాణ్యం:మండలంలో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఓ అధికారిని కేటాయించామని, ఉదయం నుంచి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటారన్నారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తారన్నారు.

సి.బెళగల్: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై గ్రామీణ ప్రాంతాల్లో శనివారం ర్యాలీలు నిర్వహించాలని ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన రోడ్లు, కూడళ్లు, మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. ప్రజలకు సైతం పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై అవగాహన ర్యాలీలను చేపట్టాలని ఈఓఆర్డీ సూచించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

కల్లూరు: ఇంటి పరిసరాల శుభ్రతతో ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఆరోగ్యంగా ఉంటామని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్ష చేయించాలన్నారు. దోమల ఉత్పత్తి అరికట్టాలంటే దోమ తెరలను వాడలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ విజయ్‌కుమార్, సూపర్ వైజర్లు నాగరాజు, మద్దమ్మ, సిబ్బంది వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు, అశోక్, పద్మావతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కురువ ఫెడరేషన్ ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): గొర్రెల పెంపకమే జీవనాధారంగా ఉన్న కురువ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 35లక్షల మంది కురువ ఓటర్లు ఉన్నా, తమ కులానికి తగిన రాజకీయ ప్రాధాన్యత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కురువలకు వంద శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకలను (పీఎంఆర్‌వై) అందించాలని, అలాగే వాటిని మేపుకునేందుకు గ్రామాల్లో భూమిని కేటాయించాలన్నారు. వర్షాకాలంలో గొర్రెల ను నిలుపుకునేందుకు 90 శాతం సబ్సిడీపై షెడ్ల నిర్మాణాలకు సహకారం అందించాలన్నారు. అలాగే ఉన్ని పరిశ్రమకుప్రభుత్వం హబ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృత్యువాత

కల్లూరు: చిన్నటేకూరు సమీపంలో ప్రమాదవశాత్తూ ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృత్యువాత చెందాడు. తెలంగాణ రాష్ట్రం అలంపూరు నియోజకర్గంలోని సుల్తానాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు కర్నూలు నగరంలో ఓ ఆసుపత్రికి చెందిన డాక్టర్ వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం డాక్టర్ చిన్నటేకూరు సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్లారు. పొలానికి వేసిన ఫెన్సింగ్ గేటు వద్ద విద్యుత్ తీగ వేలాడుతుండగా డ్రైవర్ కిందకు దిగి తీగను పక్కకు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఉపాధి కోసం వచ్చిన వ్యక్తి మృత్యువాత పడటంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

6 నుంచి శిక్షణా తరగతులు

కర్నూలు కల్చరల్: భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్‌లో జూలై 6 నుంచి 8వ తేదీ వరకు సాయి కుల్వంత్ హాల్‌లో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సేవా ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, మానవతా విలువలపై మూడు రోజుల పాటు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్య సాయి విద్యా సంస్థల విద్యార్థులు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 18 - 25 సంవత్సరాల వయసు గల బాల వికాస్ పూర్వ విద్యార్థులు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ యువతీ యువకులు సమ్మర్‌క్యాంప్‌లో పాల్గొనవచ్చని సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనాలనుకునే వారు జూన్ 18వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సత్యసాయి సేవా ట్రస్ట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

శుభకార్యం



వివాహ వేడుకలో కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ సతీష్, పార్టీ నాయకులు

సి.బెళగల్: కంబదహాల్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడి వివాహ వేడుకకు కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. శుక్రవారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌ఎస్‌యూ మండల అధ్యక్షుడు నబీరసూల్ వివాహానికి కోడుమూరు నియోజకవర్గ నాయకులు, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మండల నాయకులతో కలిసి పెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. వేడుకలో పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శులు ముందరింటి వెంకటేష్, రామాంజనేయులు, వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు మల్లి, గణేష్ తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఇంకెప్పుడు నెరవేరుస్తారు?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్

కల్లూరు: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఇంకెప్పుడు నెరవేస్తారని కాంగ్రెస్ నంద్యాల అధ్యక్షుడు, ఏఐసీసీ మెంబర్ జె.లక్ష్మీనరసింహ యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్ మెంట్, మహిళలకు ఉచిత బస్సు హామీలు అమలు కావడం లేదన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో బాలస్వామి, నాగలింగం, జనార్దన్, ఉస్మాన్ బాషా, రజాక్ వలి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకు బంధువులను పిలిచేందుకు వెళ్లి..

- గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



ఘటనా స్థలంలో మృతి చెందిన చరణ్

ఓర్వకల్లు: తమ ఊరిలో జరిగే దేవరకు బంధువులను పిలిచేందుకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై హెచ్. కొట్టాల బస్సు స్టేజీ వద్ద శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరు మండలం, చింతలపల్లె గ్రామానికి చెందిన బోయ నాగన్న కొడుకు చరణ్(16), నాగ భూషణం కొడుకు మునిరంగస్వామి అనే ఇద్దరు తమ ఊరిలో దేవర ఉత్సవాల సందర్భంగా బంధువులకు పిలిచేందుకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లె గ్రామంలో బంధువులకు చెప్పి, హెచ్ కొట్టాలలో వున్న బంధువులకు చెప్పేందుకు బయలుదేరారు. రాత్రి గడివేముల క్రాస్ రోడ్డు నుంచి, కొట్టాల వైపునకు మలుపు తిరిగారు. అంతలో నంద్యాల వైపు నుంచి కర్నూలు వైపునకు వెళ్లుతున్న గుర్తుతెలియని వాహనం యువకులు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్‌కు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతి చెందగా,మునిరంగస్వామికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన యువకుడిని 108లో కర్నూలుకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.



కర్నూలు నగరంలో తిరంగా ర్యాలీలో నిర్వహిస్తున్న దృశ్యం



మురళీనాయక్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సైనికులకు సలాం

కల్లూరు/పాణ్యం: ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన సైనిక దళాలకు సలాం అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అమ్మ ఆసుపత్రి సర్కిల్ వరకు కూటమి పార్టీల నాయకులతో కలసి తిరంగా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. దేశం కోసం ప్రాణాలు విడిచిన అమరజవాన్ మురళీనాయక్‌కు విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యం శుక్రవారం పాణ్యం ఎస్సార్బీసీ కాలనీలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు సిమెంట్ శ్రీను, విశ్వహిందూ పరిషత్ శంకరయ్య, సుబ్బరాయుడు, ఎల్లప్ప, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ క్యాంటీన్ పూర్తి వివరాలు ఇవ్వండి

- ప్రభుత్వ వైద్యుల సంఘానికి ప్రిన్సిపాల్ ఆదేశం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని క్యాంటీన్‌కు సంబంధించి పూర్తి వివరాలను తమకు అందిస్తే వాటి వివరాలను జిల్లా కలెక్టర్, డీఎంఈలకు పంపి వారి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ స్పష్టం చేశారు. క్యాంటీన్ వ్యవహారంపై శుక్రవారం కళాశాలలోని కౌన్సిల్ హాలులో హెచ్ఓడీలు, ప్రొఫెసర్లు, వైద్యులు, ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులతో ఆమె సమావేశమయ్యారు. క్యాంటీన్ లీజు ఐదు సంవత్సరాలు దాటి చాలా కాలం అయినందున దానిని తమకు అప్పగించాలని సంఘం నాయకులు ప్రిన్సిపాల్‌ను కోరారు. వివిధ విభాగాల అధిపతులు మాట్లాడుతూ.. కాలేజీ క్యాంటీన్ అందరికీ అవసరమైనదని, క్యాంటీన్ లేక ఇప్పటికే ఎంతో ఇబ్బంది పడుతున్నారని, వివాదాన్ని త్వరగా ముగించాలని కోరారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. క్యాంటీన్ వ్యవహారం ఏపీ జీడీఏకు, క్యాంటీన్ నిర్వాహకులకు మధ్య జరిగిన ఒప్పందం అని, ఆ ఒప్పంద పూర్తి వివరాల కాపీలు అందజేయాలని, సమస్య ఇప్పటికే కోర్టు పరిధికి వెళ్లినందున పాత, కొత్త సభ్యులందరూ కూర్చుని మాట్లాడుకుని సమస్య పరిష్కరించుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు వైద్యులు, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మరోచోట ఏదైనా ప్రదేశంలో క్యాంటీన్ నిర్వహణకు అనుమతిస్తే బాగుంటుందని కొందరు సభ్యులు కోరారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాళ్లు సాయిసుధీర్, విజయానందబాబు, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు బ్రహ్మాజీ మాస్టర్, నాయకులు దమామ్ శ్రీనివాసులు, సోమప్ప, రామకృష్ణనాయక్, రామశివనాయక్, మాధవిశ్యామల తదితరులు పాల్గొన్నారు.